


# కెరటం న్యూస్
(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 25 | మంగళవారం 24 ఫిబ్రవరి 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## తిరుమల లడ్డూ వివాదం..

ఏకసభ్య కమిటీ విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్




## ఆంధ్రా గడ్డపై కాలుపెడితే తొక్కిపడేస్తాం..





## ఢిల్లీలో రెండు ప్రముఖ పాఠశాలలకు బెదిరింపు మెయిల్స్





## తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో హైఅలర్ట్..




## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో భారీ స్కామ్.. ఒక్కసారిగా షేర్లు ధమాల్




## ఇంటర్నెట్ స్టార్ బేబీ మంకీ "పంచ్" కోసం.. రూ. 2 కోట్ల ఆఫర్




## రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు

ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అరెస్ట్




# మూడో ప్రపంచ యుద్ధం మొదలైంది : జెలెన్‌స్కీ

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఆదివారం బీబీసీ కి ఇచ్చిన ఇంటర్వ్యూ సంచలనంగా మారింది. ఈ విస్తృత ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మూడో ఏడాదిలోకి ప్రవేశించిన వేళ ఆయన మాట్లాడుతూ.. "ఈ యుద్ధం కేవలం ఉక్రెయిన్ సరిహద్దుల గురించి మాత్రమే కాదు, గ్లోబల్ సెక్యూరిటీ గురించి. ఇప్పటికే పుతిన్ మూడో ప్రపంచ యుద్ధం మొదలు పెట్టాడు" అని అన్నారు. రష్యా చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఆయిల్ మార్కెట్లు, ఆహార సరఫరాను ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా చైనా, ఇరాన్, నార్త్ కొరియా వంటి దేశాలు రష్యాకు సైనిక, ఆర్థిక మద్దతు అందిస్తున్నాయని ఆరోపించారు. వీరి సహకారం వల్ల యుద్ధం ప్రాంతీయ సమస్యగా కాకుండా అంతర్జాతీయ భద్రతా సంక్షోభంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు.

కాల్పుల విరమణకు 'నో'

అలాగే కాల్పుల విరమణ అంశంపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. రష్యా డిమాండ్ చేస్తున్న క్రిమియా, డాన్బాస్ ప్రాంతాలపై నియంత్రణను అంగీకరించే ప్రశ్నే లేదని చెప్పారు. తాత్కాలిక కాల్పుల విరమణ రష్యాకు బలాన్ని చేకూర్చుకునే సమయం ఇస్తుంది, తద్వారా భవిష్యత్తులో మరిన్ని తీవ్రమైన దాడులకు దిగే అవకాశం ఉంది. "పుతిన్ లక్ష్యం కేవలం ఉక్రెయిన్ మాత్రమే కాదు. అతను తన పవర్ ను ప్రపంచంపై విస్తరించాలనుకుంటున్నాడు" అని ఆయన హెచ్చరించారు. ఇదే సమయంలో జెలెన్‌స్కీ.. తమకు అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలకు మద్దతు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అధునాతన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, దీర్ఘశ్రేణి మిస్సైల్స్, ఆర్థిక సహాయం వంటివి అత్యవసరమని తెలిపారు.




## తెలంగాణ విద్యార్థులకు బిగ్ అలర్ట్..

### ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

- దాదాపు 10 లక్షల మంది హాజరు
- రాష్ట్రవ్యాప్తంగా 1,495 కేంద్రాలు
- 28,500 ఇన్విజిలేటర్లు, ప్రత్యేక స్క్వాడ్లు
- హాల్ టికెట్ డౌన్‌లోడ్‌కు అనుమతి
- 7,500 సీసీ కెమెరాలతో నిఘా
- ఒత్తిడికి 14416 టెలి-మానస్ సేవలు






# అమెరికా-ఇరాన్ మధ్య కమ్ముకున్న యుద్ధ మేఘాలు

## భారత ఎంబసీ హెచ్చరికలు

- టెహ్రాన్‌లో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి
- భారత పౌరులను వెంటనే ఇరాన్ వదిలి వెళ్లమని సూచన
- ప్రదర్శనలు, ఆందోళన ప్రాంతాలకు దూరంగా ఉండాలి
- న్యూక్లియర్ డీల్ చర్చలు విఫలం, ఉద్రిక్తత పెరుగుతోంది
- అమెరికా "జీరో ఎన్‌రిచ్‌మెంట్" డిమాండ్, ఇరాన్ తిరస్కారం
- మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక సమీకరణ, క్యారియర్ మోహరింపు
- ఇరాన్ భూగర్భ బంకర్లు, మిస్సైల్ కేంద్రాలను బలోపేతం
- సుప్రీం లీడర్ అలీ ఖమేనీ యుద్ధానికి సిద్ధం అని ప్రకటన

మిగతా 2 లో

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం**

ఇరాన్‌లో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతలు, "ఏ క్షణంలోనైనా దాడి జరగవచ్చు" అన్న వదంతులు, అలాగే టెహ్రాన్‌లో రెండో రోజు కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలు కలిసి పరిస్థితిని గందరగోళంగా మార్చాయి. ఈ నేపథ్యంలో భారత ఎంబసీ సోమవారం అత్యవసర అడ్వైజరీ జారీ చేసింది. గతంలో ఇచ్చిన సూచనల కొనసాగింపుగా ఈ తాజా హెచ్చరిక విడుదలైంది. ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు, ముఖ్యంగా విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారులు, టూరిస్టులు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను ఉపయోగించి (వాణిజ్య విమానాలు సహా) వీలైనంత త్వరగా ఇరాన్ ను వదిలి వెళ్లాలని సూచించింది. ప్రదర్శనలు, ఆందోళనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని హెచ్చరించింది.


## కిష్త్వార్‌లో ఆపరేషన్ త్రాషి-I విజయవంతం

- మేజర్ జనరల్ ఏపీఎస్ బాల్ ప్రెస్ మీట్
- ముగ్గురు ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్
- సమగ్ర ప్రణాళికతో సాధించిన విజయం
- భద్రతా దళాల సమన్వయ కృషి
- ప్రాణనష్టం లేకుండా ఆపరేషన్ పూర్తి
- శునకం 'టైసన్' వీరమరణం




## పాము కాటు ప్రచారం అవాస్తవం

- క్యూలైన్‌లో ఘటనపై టీటీడీ క్లారిటీ
- వరంగల్ దంపతులకు భయం
- అశ్వినీ ఆసుపత్రిలో పరీక్షలు
- స్విమ్స్‌లోనూ నెగటివ్ రిపోర్ట్
- పాము విషపూరితం కాదని నిర్ధారణ
- నిషేధిత ప్రాంతాలకు వెళ్లొద్దని సూచన




# డ్రగ్ డాన్ ఎల్ మెన్చో హత్య

## మంటల్లో తగలబడుతోన్న మెక్సికో

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన డ్రగ్స్ మాఫియా డాన్ నెమెసియో రుబ్న్ ఒసెగుయెరా అలియాస్ ఎల్ మెన్చో (60) భద్రతా దళాల కాల్పుల్లో హతమయ్యాడు. ఆదివారం ఎల్ మెన్చో చనిపోయినట్లుగా మెక్సికో రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

అసలు కథ ఇప్పుడే మొదలైంది. ఎల్ మెన్చో అలా హతమయ్యాడో లేదో మద్దతుదారులు రోడ్లపైకి వచ్చి రణరంగం సృష్టించారు. రహదారులపై వాహనాలను తగలబెట్టారు. ఆస్తులు ధ్వంసంతో పాటు నిప్పుపెట్టారు. పెట్రోల్ బంకులకు నిప్పుపెట్టారు. దీంతో ప్రస్తుతం మెక్సికోలోని నగరాలు పొగలు, మంటలతో ఎగిసిపడుతున్నాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.


20 రాష్ట్రాల్లో 250కు పైగా వాహనాలు తగలబెట్టినట్లుగా మెక్సికన్ భద్రతా అధికారులు వెల్లడించారు. రోడ్లుబ్లాక్ చేసి.. రవాణా కారిడార్‌లను స్తంభింజేసి.. ఇళ్లల్లోంచి ప్రజలను బయటకు రాకుండా బీభత్సం సృష్టించారు. ప్రస్తుతం ఒక విమానాశ్రయం దగ్గర కూడా మంటలు ఎగిసిపడుతున్నాయి. ఎల్ మెన్చోకు మద్దతుదారులైన వారంతా ఈ ఘాతుకానికి పాల్పడ్డారని అధికారులు వెల్లడించారు. హత్యకు ప్రతీకార చర్యగా దారుణాలకు ఒడిగట్టినట్లుగా చెప్పారు. ఇక ఎయిర్ కెనడా, యునైటెడ్, ఏరోమెక్సికో, అమెరికన్ ఎయిర్‌లైన్స్ వంటి ప్రధాన విమానయాన సంస్థలు విమాన సర్వీసులను నిలిపివేశాయి.




# డ్రైవర్ల రాత మార్చనున్న 'భారత్ టాక్సీ'..

## కేంద్ర మంత్రి అమిత్ షా కీలక ప్రకటన

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో 'భారత్ టాక్సీ' ప్రాజెక్టు విశేషాలను వివరిస్తూ కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. కష్టపడి పనిచేసే సామాన్యుడికే లాభాలు దక్కాలనే ఉద్దేశంతో 'భారత్ టాక్సీ'నీ తీసుకువచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ప్రైవేట్ ట్యాక్సీ కంపెనీలు డ్రైవర్ల సంపాదనలో 30 శాతం వరకు కోత విధిస్తున్నాయని, కానీ భారత్ టాక్సీలో డ్రైవర్లే యజమానులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. ఈ భారత్ టాక్సీ ప్రాజెక్టులో డ్రైవర్లు కేవలం రూ. 500 పెట్టుబడితో చేరవచ్చని అమిత్ షా వివరించారు. దీని లాభాల పంపిణీ గురించి వివరిస్తూ.. మొదటి మూడు ఏళ్ల పాటు డ్రైవర్లకు నిర్ణీత అద్దె లభిస్తుందని, అయితే ఆ తర్వాత వారు లాభాల్లో వాటా పొందుతారని తెలిపారు. ఉదాహరణకు సంస్థ రూ. 25 కోట్లు సంపాదిస్తే, అందులో 20 శాతం నిధులు ట్యాక్సీ మూలధనంగా జమ అవుతాయని, మిగిలిన 80 శాతం లాభాలను డ్రైవర్లు నడిపిన కిలోమీటర్ల ఆధారంగా నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తామని వెల్లడించారు.



కెరటం (సామాన్యుడి ఆయుధం) న్యూస్



# ఇంటర్నెట్ స్టార్ బేబీ మంకీ "పంచ్" కోసం.. రూ. 2 కోట్ల ఆఫర్



**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** జపాన్‌లోని ఇచికావా సిటీ జూ లో ఉన్న ఏడు నెలల బేబీ జపనీస్ మాకాక్ కోతి "పంచ్" ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయింది. తల్లి తిరస్కరించడంతో జూ సిబ్బంది దాన్ని పెంచారు. ఇతర కోతులు దాన్ని దగ్గరికి రానీయకపోవడంతో, పంచ్ ఒక స్టఫ్ట్ ఆరెంగుటాన్ బొమ్మను గట్టిగా పట్టుకుని ఓదార్పు పొందుతున్న వీడియోలు వైరల్ అయ్యాయి. తర్వాత వచ్చిన కొన్ని వీడియోల్లో పెద్ద కోతులు పంచ్‌ను లాగడం, కొట్టడం వంటి సీన్లు కనిపించడంతో "బుల్లింగ్" అని భావించి నెటిజన్లు భారీగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వీడియోలు చూసిన ఇన్‌ఫ్లుయెన్సర్ ఆంద్రూ టేట్, సోదరుడు ట్రిస్టన్ టేట్ ట్విట్టర్లో పోస్ట్ చేశాడు. "ఈ కోతి ఏ జూలో ఉంది? నేను, ఆంద్రూ టేట్ కలిసి దాన్ని కొనేస్తాం. సుమారు రూ. 2 కోట్లు. నేను జోక్ చేయడం లేదు" అని పోస్టు చేశారు. ఈ పోస్ట్ కొద్ది రోజుల్లోనే 55 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి.

ట్రిస్టన్ టేట్ బిడ్ వల్ల సోషల్ మీడియాలో భారీ డిబేట్ మొదలైంది.. కొందరు టేట్ బ్రదర్స్ దాన్ని రెస్క్యూ చేయాలని సపోర్ట్ చేశారు. మరికొందరు జూలోనే ఉంచి సరైన కేర్ ఇవ్వాలని, డబ్బుతో కొనడం సరికాదని అంటున్నారు. కొందరు జూకు డొనేషన్లు చేయాలని సూచిస్తున్నారు. ఇటీవలే ట్రాన్ జస్టిన్ సన్ కూడా ఈ జూకు 100,000 డాలర్లు డొనేట్ చేశాడని వార్తలు వచ్చాయి. జూ ఇంకా టేట్ బ్రదర్స్ ఆఫర్‌పై ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. పంచ్ ఇప్పుడు క్రమంగా ఇతర కోతులతో స్నేహం చేస్తోందని, హ్యాపీగా ఉందని రిపోర్టులు చెబుతున్నాయి. ఈ క్యూట్ బేబీ మంకీ స్టోరీ ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది హార్ట్స్‌ను టచ్ చేసింది.

# డ్రైవర్ల రాత మార్చనున్న 'భారత్ టాక్సీ'.. కేంద్ర మంత్రి అమిత్ షా కీలక ప్రకటన

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో 'భారత్ టాక్సీ' ప్రాజెక్టు విశేషాలను వివరిస్తూ కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. కష్టపడి పనిచేసే సామాన్యుడికే లాభాలు దక్కాలనే ఉద్దేశంతో 'భారత్ టాక్సీ'నీ తీసుకువచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ప్రైవేట్ ట్యాక్సీ కంపెనీలు డ్రైవర్ల సంపాదనలో 30 శాతం వరకు కోత విధిస్తున్నాయని, కానీ భారత్ టాక్సీలో డ్రైవర్లే యజమానులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు.

ఈ భారత్ టాక్సీ ప్రాజెక్టులో డ్రైవర్లు కేవలం రూ. 500 పెట్టుబడితో చేరవచ్చని అమిత్ షా వివరించారు. దీని లాభాల పంపిణీ గురించి వివరిస్తూ.. మొదటి మూడు ఏళ్ల పాటు డ్రైవర్లకు నిర్ణీత అద్దె లభిస్తుందని, అయితే ఆ తర్వాత వారు లాభాల్లో వాటా పొందుతారని తెలిపారు. ఉదాహరణకు సంస్థ రూ. 25 కోట్లు సంపాదిస్తే, అందులో 20 శాతం నిధులు ట్యాక్సీ మూలధనంగా జమ అవుతాయని, మిగిలిన 80 శాతం లాభాలను డ్రైవర్లు నడిపిన కిలోమీటర్ల ఆధారంగా నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తామని వెల్లడించారు.

"సాధారణ కంపెనీల లక్ష్యం ధనవంతులను మరింత ధనవంతులుగా చేయడం, కానీ మా లక్ష్యం కష్టపడే డ్రైవర్లను యజమానులను చేయడం" అని అమిత్ షా పేర్కొన్నారు. డ్రైవర్లు కేవలం పని వారే కాకుండా లాభాల్లో వాటాదారులుగా మారతారని, అయితే ఈ ఫలితాలు అందడానికి మొదటి మూడు ఏళ్ల పాటు కొంత ఓపిక పట్టాలని ఆయన సూచించారు. ఈ విధానం వల్ల ట్యాక్సీ రంగంలో డ్రైవర్ల దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని ఈ సందర్భంగా అమిత్ షా ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణ విద్యార్థులకు బిగ్ అలర్ట్.. ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు థియరీ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో మొత్తం 9,97,075 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. అందులో ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 4,89,126 మంది, సెకండియర్ విద్యార్థులు 5,07,949 మంది ఉన్నారు. ఇందుకోసం స్టేట్ వైడ్‌గా 1,495 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రైవేటు కాలేజీలతో పాటు 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలు కూడా ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 28,500 మంది ఇన్విజిలేటర్లు, 75 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 200 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందే, అంటే ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి లేదా కళాశాలల నుండి హాల్ టికెట్లు పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సంతకం లేకపోయినా డౌన్‌లోడ్ చేసిన హాల్ టికెట్లను అనుమతించాలని బోర్డు ఆదేశించింది.

7,500 సీసీ కెమెరాలతో నిఘా..

ఇక సెల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పరీక్షా హాల్లోకి అనుమతించరు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. విద్యార్థుల కోసం ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, ఫర్నిచర్, గోడ గడియారాలు వైద్య సహాయం అందుబాటులో ఉంటాయి. పరీక్షా కేంద్రాల వద్ద నిఘా కోసం సుమారు 7,500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని టీజీబీఐఈ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నేరుగా పర్యవేక్షిస్తారు. అలాగే, పరీక్షల సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు.

మానసిక ఒత్తిడి నివారణకు 'టెలి-మానస్'

పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురైతే నిపుణులైన సైకాలజిస్టుల సలహాల కోసం 14416 అనే టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని బోర్డు సూచించింది. ఈ సేవలు 24 గంటలు అందుబాటులో ఉండనున్నాయి.

# పాము కాటు ప్రచారం అవాస్తవం

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** తిరుమలలో దర్శన క్యూలైన్ లో మహిళా భక్తురాలికి పాము కాటు అని ప్రసార మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తమని టీటీడీ వెల్లడించింది. తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన శరత్ బాబు, మౌనిక దంపతులు ఆదివారం రాత్రి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారని వివరించారు.

ఈ నేపథ్యంలో ట్యాక్సీలో మ్యూజియం సమీపాన ఉన్న ఆర్.బి.సెంటర్ పార్కింగ్ ఏరియాకు చేరుకోగానే మౌనిక తన పాదాలకు పసుపు రాసుకునేందుకు చీకటిలో పక్కనే ఉన్న స్థలంలోకి వెళ్లిందన్నారు. ఈ క్రమంలో కాలుపై స్పర్శ తగలడంతో భయపడి భర్త శరత్ వివరించగా ఆ ప్రాంతాన్ని పరిశీలించగా చిన్న పాము కనిపించిందన్నారు.

వెంటనే భద్రతా సిబ్బందికి సమాచారం అందించడంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రికి తరలించారని, వైద్యులు పరీక్షలు నిర్వహించి ఎలాంటి పాము కాటు లేదని నిర్ధారించారని వివరించారు. అయినప్పటికీ మహిళా భక్తురాలి ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఎలాంటి సమస్య లేదని నిర్ధారించారని వెల్లడించారు. ఆ పాము కూడా విషపూరితం కాదని విచారణలో తేలిందన్నారు. సోమవారం ఉదయం దంపతులు క్షేమంగా శ్రీవారిని దర్శించుకున్నారని తెలిపారు. భక్తులు తమ భద్రత దృష్ట్యా టీటీడీ నిర్దేశించిన ప్రాంతాల నుంచి మాత్రమే క్యూలైన్లలోకి వెళ్లాలని, తిరుమల పరిసరాల్లోని నిషేధిత అటవీ ప్రాంతాల్లో సంచరించవద్దని టీటీడీ భక్తులకు విజ్ఞప్తి చేసింది .

# ఆంధ్రా గడ్డపై కాలుపెడితే తొక్కిపడేస్తాం.. బిఆర్ఎస్ కు మంత్రి వాసంశెట్టి స్ట్రైట్ వార్నింగ్

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** కోనసీమ వేదికగా ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన కేవలం విమర్శలతో ఆగకుండా, సరిహద్దు దాటి వస్తానంటే ఊరుకునేది లేదని తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి స్ట్రైట్ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణకే పరిమితమైన గులాబీ పార్టీ, ఆంధ్రా గడ్డపై కాలు మోపాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన ధ్వజమెత్తారు. ముఖ్యంగా శెట్టిబలిజ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సెన్సేషన్ అవుతున్నాయి. తెలంగాణలో శెట్టిబలిజలను ఓసీల్లో చేర్చి అన్యాయం చేసిన చరిత్ర కేసీఆర్ ది అని మండిపడ్డారు. అలాంటి పార్టీ ఇక్కడ అడుగుపెడితే, శెట్టిబలిజలంతా ఏకమై తొక్కి పడేస్తారంటూ మంత్రి నిప్పులు చెరిగారు.

చివరగా ఆయన మాజీ సీఎం వైఎస్ జగన్ పైన కూడా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ ప్రస్తుతం తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉన్నారని, ఆ గందరగోళం నుంచి బయటపడాలంటే యోగా ఒక్కటే మార్గమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.

# తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో హైఅలర్ట్.. కర్రెగుట్ట అడవుల్లో గెరిల్లా పోరు

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో మరోసారి తుపాకుల మోత, బాంబు పేలుళ్లతో దద్దరిల్లుతోంది. మావోయిస్టు అగ్రనేతలే లక్ష్యంగా భద్రతా బలగాలు చేపట్టిన భారీ సెర్చ్ ఆపరేషన్ ప్రస్తుతం ఉత్కంఠ రేపుతోంది. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతమైన కర్రెగుట్ట అడవుల్లో బలగాలు, మావోయిస్టుల మధ్య గెరిల్లా తరహా పోరు కొనసాగుతోంది.

బంకర్లు ధ్వంసం.. మందుపాతరలు నిర్వీర్యం

మావోయిస్టులు నిర్మించుకున్న రహస్య బంకర్లను కోబ్రా దళాలు గుర్తించి తాజాగా నేలమట్టం చేశాయి. జెల్ల, తడపాల, డోలి అటవీ ప్రాంతాలను జోరుగా కూబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ క్రమంలో బలగాలను టార్గెట్ చేస్తూ మావోయిస్టులు అమర్చిన పలు మందుపాతరలను బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ చాకచక్యంగా నిర్వీర్యం చేస్తున్నారు. కర్రెగుట్ట ప్రాంతంలో భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపిస్తుండటంతో స్థానిక గిరిజన గ్రామాలు భయాందోళనకు గురవుతున్నాయి.

కంటిమీద కునుకు లేకుండా..

అడవుల్లో అంగుళం అంగుళాన్ని భద్రతా దళాలు కంటిమీద కునుకు లేకుండా సోదా చేస్తున్నట్లుగా తెలుస్తోంది. డ్రోన్ల సాయంతో మావోయిస్టుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సరిహద్దు దాటి చొరబడకుండా అటు ఛత్తీస్‌గఢ్ పోలీసులు, ఇటు తెలంగాణ గ్రేహౌండ్స్ దళాలు సమన్వయంతో జాయింట్ కూంబింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. మిగిలి ఉన్న అగ్రనేతలు కూడా చిక్కితే మావోయిస్టుల సాయుధ పోరాటానికి ఎండ్ కార్డు పడుతుందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఇక మావోయిస్టు పార్టీ తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీ బడే చొక్కారావు అలియాస్ దామోదర్ జాడ కోసం కర్రెగుట్ట ప్రాంతంలో భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఇక జార్ఖండ్‌లోని అత్యంత ప్రమాదకరమైన శరందా అటవీ ప్రాంతంలో మిసిర్ బేస్రా కోసం కోబ్రా దళాలు గాలిస్తున్నాయి.

# తిరుమల లడ్డూ వివాదం.. ఏకసభ్య కమిటీ విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారనే వివాదం మరోసారి సుప్రీంకోర్టు గడప తొక్కింది. సిట్ విచారణ నివేదిక అనంతరం ఏపీ ప్రభుత్వం దర్యాప్తు కోసం ప్రత్యేకంగా ఒక ఏకసభ్య కమిటీని నియమించడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఇవాళ సుప్రీం ధర్మాసనం ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టి సంచలన తీర్పును వెలువరించింది. తిరుమల లడ్డూ కేసులో ఏపీ ప్రభుత్వం వేసిన ఏకసభ్య కమిటీ దర్యాప్తు కొనసాగించవచ్చని ధర్మాసనం తేల్చి చెప్పింది. అదేవిధంగా ఆ ప్రత్యేక కమిటీ ఓవర్‌లాపింగ్ కిందికి రాదని కోర్టు స్పష్టం చేసింది.

కాగా, ఇప్పటికే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేసిన తరుణంలో, మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం మరో కమిటీని నియమించడంపై సుబ్రహ్మణ్య స్వామి తీవ్ర అభ్యంతరం వ్యక్తం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, సిట్, సీబీఐ, టీటీడీ లను ప్రతివాదులుగా చేర్చారు. సీబీఐ నేతృత్వంలోని సిట్ సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో తిరుమల లడ్డూ తయారీలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు లేదని పేర్కొన్నారు. అయితే సింథటిక్ నెయ్యి, పామాయిల్ వంటి పదార్థాలతో భారీ ఎత్తున కల్తీ జరిగిందని వెల్లడించారు. ఈ నివేదికపై తదుపరి చర్యల కోసం ప్రభుత్వం ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయగా.. అది సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధమని సుబ్రమణ్య స్వామి పిటిషన్ దాఖలు చేయడం హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే.

# ఢిల్లీలో రెండు ప్రముఖ పాఠశాలలకు బెదిరింపు మెయిల్స్

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో మరో సారి బాంబు బెదిరింపులు కలకలం గా మారాయి. సోమవారం ఉదయం.. రెండు పాఠశాలలకు ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. ధౌలా కువాన్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్, లోధి రోడ్డులోని ఎయిర్ ఫోర్స్ బాల్ భారతి స్కూల్ ఈ బెదిరింపులను అందుకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే భద్రతా సంస్థలు అప్రమత్తమై భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి.

బెదిరింపు ఈమెయిల్స్ అందిన వెంటనే పాఠశాల యాజమాన్యాలు అధికారులకు సమాచారం అందించాయి. ముందస్తు జాగ్రత్తగా రెండు పాఠశాలల ప్రాంగణాలను ఖాళీ చేయించి, విద్యార్థులను, సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఢిల్లీ పోలీసులతో పాటు బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. పాఠశాలల చుట్టుపక్కల ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

ప్రస్తుతానికి తనిఖీల్లో ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఈమెయిల్స్ ఎక్కడి నుండి వచ్చాయి. పంపినవారు ఎవరు అనే కోణంలో సైబర్ సెల్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. కాగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులోకి రావాల్సి ఉంది.

# కిష్త్వార్‌లో ఆపరేషన్ త్రాషి-I విజయవంతం

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** జమ్మూ కశ్మీర్ లోని కిష్త్వార్ ఆదివారం ఆపరేషన్ త్రాషి-1 నిర్వహించి ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చిన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం విజయవంతంగా ముగిసిన ఈ ఆపరేషన్ పట్టుదల, స్పష్టమైన ఆలోచన, సరైన ప్రణాళికకు ఒక చక్కని ఉదాహరణ అని మేజర్ జనరల్ ఏపీఎస్ బాల్ అభివర్ణించారు. గత కొన్ని నెలలుగా అన్ని భద్రతా దళాలు, ఏజెన్సీలు సమగ్ర విధానం తో చేసిన అవిశ్రాంత కృషి వల్లనే ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో జవాన్ల నుండి ఉన్నతాధికారుల వరకు అందరూ ఎంతో సమన్వయంతో, ప్రశాంతంగా, సమిష్టిగా పని చేయడం వల్లే ఈ ఆపరేషన్ నిర్ణయాత్మక విజయాన్ని అందుకుందని తెలిపారు. ఈ ఆపరేషన్ యొక్క అతిపెద్ద విజయం ఏమిటంటే, మన సైన్యానికి ఎటువంటి ప్రాణనష్టం, గాయాలు కాకుండా లక్ష్యాన్ని పూర్తి చేయడం. అయితే, ఈ ఆపరేషన్‌ను మొదట ప్రారంభించి, వీరోచితంగా పోరాడిన శునకం 'టైసన్' ఈ క్రమంలో ప్రాణత్యాగం చేసింది. టైసన్ మినహా మన దళాలన్నీ సురక్షితంగా ఉన్నాయని ఆయన ధృవీకరించారు. ఈ ఆపరేషన్ విజయంలో డీజీపీ, ఆర్మీ కమాండర్ నుంచి అట్టడుగు స్థాయి సైనికుల వరకు ప్రతి ఒక్కరి సహకారం ఉందని మేజర్ జనరల్ ఏపీఎస్ బాల్ మీడియాకు చెప్పుకొచ్చారు.

# మూడో ప్రపంచ యుద్ధం మొదలైంది : జెలెన్‌స్కీ

మొదటి పేజీ తరువాయి

అవన్నీ అతియోశక్తి మాటలు : రష్యా

ఈ వ్యాఖ్యలపై రష్యా అధ్యక్షుడువ్లాదిమిర్ పుతిన్ నేతృత్వంలోని క్రెమ్లిన్ ప్రతిస్పందిస్తూ.. "మూడో ప్రపంచ యుద్ధం" అనే మాట అతిశయోక్తి అని పేర్కొంది. అయితే యూరోపియన్ నాయకులు ఉక్రెయిన్‌కు అదనపు సైనిక సహాయం అందించే దిశగా చర్చలు ప్రారంభించినట్లు సమాచారం. అమెరికా కాంగ్రెస్‌లో కూడా ఉక్రెయిన్ ప్యాకేజీలపై చర్చలు మళ్లీ వేగం పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీ వ్యాఖ్యలు భవిష్యత్తుపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెంచాయి. అంతర్జాతీయ భద్రత, నాటో విస్తరణ, రష్యా-చైనా సంబంధాలు వంటి అంశాలు మళ్లీ ప్రధాన చర్చాంశాలుగా మారాయి. జెలెన్‌స్కీ ఈ తాజా ఇంటర్వ్యూ రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కేవలం ఇరు దేశాలకే పరిమితం కాకుండా గ్లోబల్ రాజకీయ సమీకరణాలను మార్చే స్థాయికి చేరిందనే విషయం స్పష్టం అవుతోంది.

# డ్రగ్ డాన్ ఎల్ మెన్చో హత్య.. మంటల్లో తగలబడుతోన్న మెక్సికో

మొదటి పేజీ తరువాయి



ప్రస్తుతం పరిస్థితులు బాగోలేనందున ప్రజలు ఎవరూ ఇళ్లల్లోంచి బయటకు రావొద్దని జాలిస్కో గవర్నర్ పాబ్లో లెమస్ కోరారు. ప్రజా రవాణాను నిలిపివేశారు. రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో జీవిస్తోందని హెచ్చరించారు.

భారతీయులకు అలర్ట్..

మెక్సికోలో అల్లర్ల నేపథ్యంలో భారత పౌరులకు కేంద్ర ప్రభుత్వం అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం హింసాత్మక పరిస్థితుల దృష్ట్యా మెక్సికోలో భారత పౌరులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు ఇళ్లల్లోనే ఉండాలనిని పేర్కొంది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, స్థానిక అధికారుల అప్‌డేట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తెలిపింది. సాయం కోసం రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది.

# ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో భారీ స్కామ్.. ఒక్కసారిగా షేర్లు ఢమాల్

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. దీంతో పెట్టుబడిదారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనతో బ్యాంక్ షేర్లు ఒక్కసారిగా కుప్పకూలి పోయాయి. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచ్‌లో రూ. 590 కోట్ల మేర ఫ్రాడ్ బయటపడింది. ఈ మోసం హర్యానా ప్రభుత్వం సంబంధిత ఖాతాలతో కలిసినట్టు బ్యాంక్ తెలియజేసింది. దీంతో ఇవాళ (ఫిబ్రవరి 23న) ట్రేడింగ్ ప్రారంభం కాగానే ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్ ధర 20 శాతం వరకు పడిపోయి ఒక్కో షేర్ రూ. 66.85కి చేరుకుంది. నిన్న ముగింపు ధర రూ. 83.57 కాగా, సోమవారం షేర్ రూ. 75.21 దగ్గర ప్రారంభమైంది. అంటే ఓపెనింగ్ నుంచే దాదాపు 10 శాతం నష్టంతో ట్రేడింగ్ స్టార్ట్ అయింది.

ఈ స్కామ్ గుర్తించిన వెంటనే హర్యానా ప్రభుత్వం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తో పాటు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌ను ప్రభుత్వ పనుల ప్యానెల్ లిస్ట్ నుంచి తొలగించింది. ఇకపై ప్రభుత్వ లావాదేవీల కోసం ఈ బ్యాంకులను ఉపయోగించమని తేల్చి చెప్పింది. బ్యాంక్ రిలీజ్ చేసిన ప్రకటనలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్టు పేర్కొనింది. అలాగే స్వతంత్ర సంస్థ ద్వారా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించనున్నట్టు వెల్లడించింది. బ్యాంక్ ఫైలింగ్ ప్రకారం, హర్యానా సర్కార్ లోని ఒక విభాగం నుంచి వచ్చిన సమాచారంతో మొదట అంతర్గత విచారణ చేపట్టగా.. ఆ సమయంలో చండీగఢ్ బ్రాంచ్‌లో కొందరు ఉద్యోగులు మోసపూరితంగా వ్యవహరించినట్టు తేలింది. ఈ వ్యవహారంలో ఇతర వ్యక్తులు లేదా సంస్థలు కూడా ఉండే ఛాన్స్ ఉందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది.

# రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అరెస్ట్

**న్యూస్ డెస్క్, 23 ఫిబ్రవరి (కెరటం న్యూస్):** రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ను గుంటూరు నగరంపాలెం పోలీసులు బీహార్‌లో అరెస్ట్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో రఘురామకృష్ణరాజును అరెస్ట్ చేసిన సమయంలో, కస్టడీలో ఆయనపై అమానుషంగా భౌతిక దాడి జరిగిందని నమోదైన కేసులో సునీల్ నాయక్ నిందితుడిగా ఉన్నారు. అప్పట్లో సీఐడీ విభాగంలో పనిచేసిన ఆయన, రఘురామపై జరిగిన దాడిలో కీలక పాత్ర పోషించారనే ఆరోపణలు ఉన్నాయి.

అయితే, తాజాగా కేసు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులకు సునీల్ నాయక్ బీహార్‌లో తలదాచుకున్నట్లుగా విశ్వసనీయవర్గాల ద్వారా పక్కా సమాచారం అందింది. దీంతో గుంటూరు నగరంపాలెం పోలీసుల స్పెషల్ టీమ్ బీహార్ వెళ్లి ఆయనను అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయనను ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు ఉన్నతాధికారులపై విచారణ జరుగుతుండగా.. సునీల్ నాయక్ అరెస్ట్ కావడం రాష్ట్ర రాజకీయాలతో పాటు అటు పోలీస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# అమెరికా-ఇరాన్ మధ్య కమ్ముకున్న యుద్ధ మేఘాలు భారత ఎంబసీ హెచ్చరికలు

మొదటి పేజీ తరువాయి

స్థానిక వార్తా మాధ్యమాలను గమనిస్తూ, పరిస్థితులపై అప్డేట్స్ తెలుసుకోవాలని సూచించింది. పాస్‌పోర్ట్, వీసా, ఇతర గుర్తింపు కార్డులు ఎప్పుడూ సులభంగా అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేసింది. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించేందుకు ఎంబసీ హెల్ప్‌లైన్ నంబర్లు కూడా వెల్లడించింది: +98 912 810 9115, +98 912 810 9109, +98 912 810 9102, +98 993 217 9359. మరోవైపు భారత ప్రభుత్వం ఇప్పటికే ఇరాన్‌కు నాన్-ఎసెన్షియల్ ట్రావెల్‌ను నిషేధించింది.

అమెరికా-ఇరాన్ యుద్ధ టెన్షన్లు: ప్రస్తుతం అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు అత్యంత తీవ్ర దశకు చేరుకున్నాయి. గత ఏడాది జూన్ 2025లో జరిగిన 12 రోజుల యుద్ధం తర్వాత మళ్లీ ఇరాన్ లో యుద్ధ వాతావరణం కనిపిస్తోంది. ప్రధానంగా న్యూక్లియర్ డీల్ చర్చలే ఈ సంక్షోభానికి కేంద్రబిందువుగా మారాయి. జెనీవాలో ఓమన్ మధ్యవర్తిత్వంతో జరుగుతున్న ఇండైరెక్ట్ చర్చలు ఇంకా ఫలితం ఇవ్వలేదు. ఫిబ్రవరి 26న మూడో రౌండ్ చర్చలు జరగనున్నాయి. అమెరికా "జీరో ఎన్‌రిచ్‌మెంట్" అంటే ఇరాన్ యురేనియం ఎన్‌రిచ్ చేయకూడదని కోరుతోంది. ఇరాన్ ఈ డిమాండ్‌ను పూర్తిగా తిరస్కరించింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఫిబ్రవరి 20న ఇరాన్‌కు 10-15 రోజుల గడువు ఇచ్చి, డీల్ కుదరకపోతే "really bad things" జరుగుతాయని హెచ్చరించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసింది. మధ్యప్రాచ్యంలో అమెరికా భారీ సైనిక సమీకరణ చేపట్టింది. రెండు ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్స్ అయిన USS Abraham Lincoln, USS Gerald R. Ford ను ఇప్పటికే మోహరించాయి. ఇరాన్ న్యూక్లియర్ సైట్లు, బాలిస్టిక్ మిస్సైల్ కేంద్రాలు, IRGC బేస్‌లపై దాడులకు సిద్ధంగా ఉన్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

ఇక ఇరాన్ కూడా యుద్ధానికి సై అంటోంది. సాటిలైట్ చిత్రాల ప్రకారం భూగర్భ బంకర్లు, మిస్సైల్ కేంద్రాలను బలోపేతం చేస్తోంది. స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ వద్ద రష్యాతో కలిసి నేవల్ ఎక్సర్‌సైజ్ నిర్వహించడం గ్లోబల్ ఆయిల్ సరఫరాపై ఒత్తిడి తీసుకురావడమేనని భావిస్తున్నారు. టెహ్రాన్‌లో విద్యార్థుల ఆందోళనలు రెండో రోజు కొనసాగుతుండటం దేశీయ ఒత్తిడిని పెంచుతోంది. ఇదే సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ "ఎలాంటి పరిస్థితికైనా సిద్ధంగా ఉన్నాం" అని ప్రకటించారు. మొత్తం పరిస్థితి రోజుకో మలుపు తిరుగుతోంది. చర్చలు విఫలమైతే సైనిక దాడులు.. ముఖ్యంగా న్యూక్లియర్, మిస్సైల్ కేంద్రాలపై అమెరికా విరుచుకుపడే అవకాశం ఉందని అంతర్జాతీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## గోడౌన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు**



**కామారెడ్డి బ్యూరో, కెరటం న్యూస్:** కామారెడ్డి జిల్లా కోల్లూరు లో 10 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ నిర్మాణ పనులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తనిఖీ చేశారు. పనుల ప్రగతిని ప్రతిరోజూ నివేదించాలని కూడా ఆదేశించారు. అలాగే నిర్మాణ పనులు మరింత వేగంగా జరిగేలా కార్మికుల సంఖ్యను పెంచాలని సూచించారు. నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీపడకుండా నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యస్.ఈ శ్రీనివాస్, జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, డీఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం సాధనలో కాంగ్రెస్ చారిత్రాత్మక పాత్ర





**వికారాబాద్ బ్యూరో, కెరటం న్యూస్:** వికారాబాద్‌లో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని సామాజిక, ఆర్థిక రుగ్మతలకు పరిష్కారం కోసం శ్రీ రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఉందని అన్నారు. రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రజల్లో నిరంతరం పనిచేస్తూ అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుల వివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం సాధనలో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక పాత్ర పోషించిందని పేర్కొన్న ఆయన, అంటరానితనం నిర్మూలన నుంచి భూ సంస్కరణలు, ఎస్సీ–ఎస్టీ హక్కుల పరిరక్షణ వరకు అనేక విప్లవాత్మక నిర్ణయాలు కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమయ్యాయని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడంతో పాటు సామాజిక న్యాయం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని విమర్శించిన ఆయన, రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ నాయకులు విశ్వనాథన్, వంశీ చందర్ రెడ్డి, సావంత్, సచిన్ రావు గార్లతో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి తదితర జిల్లా, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఫీజులు కట్టలేదని ఇంటర్ హాల్ టికెట్స్ నిలుపుదల చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర కమిటీ**

**హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్:** రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రైవేట్, కార్పోరేట్ జూనియర్ కళాశాలలు ఫీజులు కట్టలేదని పేరుతో హాల్ టికెట్స్ నిలుపుదల చేయడం విద్యార్థుల హక్కులను హరించడమే హాల్ టికెట్స్ ఇవ్వకుండా వేధింపులు చేస్తున్న కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు రాజ్యాంగం చదువుకునే హక్కును కల్పించిందని వేధించడం సరైనది కాదని విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇంటర్నెట్, వాట్సాప్ లో ఇస్తున్నామని చెబుతున్న ఇంటర్ కళాశాలలు ఫీజులు కోసం వేధింపులకు గురి చేస్తున్నారని, హాల్ లో ఇవ్వకుండా వేధిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుంది. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తుందని తెలిపారు.

# రైతు భరోసా ఏదీ?..


# అన్నదాతల ఉసురు పోసుకుంటున్న సర్కార్!

**రుణమాఫీ పేరుతో 'సాంకేతిక' నాటకాలు..**

**తక్షణమే బకాయిలు చెల్లించాలి**

**ఎరువుల కొరత సృష్టిస్తే సహించేది లేదు**

**జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు**





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ఖమ్మం జిల్లా రైతాంగం అష్టకష్టాలు పడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదా? అని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ప్రశ్నించారు. అన్నదాతల కన్నీళ్లు చూస్తూ యంత్రాంగం నిద్రపోతోందా? అని ఆయన మండిపడ్డారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీనారాయణ పిలుపు మేరకు సోమవారం కిసాన్ మోర్చా నాయకులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

అనంతరం నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. "ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇవ్వాల్సిన రైతు భరోసా ఏమైంది? వెంటనే అన్నదాతల ఖాతాల్లో ఆ డబ్బులు ఎందుకు జమ చేయడం లేదు?" అని నిలదీశారు. సర్వర్లు, సాంకేతిక లోపాల పేర్లతో రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బూటకపు సాకులు పక్కనపెట్టి, అర్హులైన రైతులందరికీ తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహ జ్వాలలకు ప్రభుత్వం భస్మం కాకతప్పదని హెచ్చరించారు.

యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తుంటే పాలకులకు కనిపించడం లేదా? అని ఆయన ప్రశ్నించారు. ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ధాన్యం బోనస్ బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని తేల్చి చెప్పారు. రాబోయే యాసంగి సీజన్ లో వరి ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పటికైనా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

నాగార్జున సాగర్ ఆయకట్టు కింద పండిన పంటలు ఎండిపోకుండా, చివరి దశ వరకు నిరంతరా యంగా సాగునీరు అందించాలని కోరారు. అలాగే, పత్తి కొనుగోలు గడువును పెంచి మద్దతు ధరతో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, బీజేపీ నాయకులు మదడపు సుబ్బారావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన భీమిరెడ్డి పుల్లారెడ్డి భరణిపాడు నుంచి పర్వతాపురం ఆర్ అండ్ బీ రోడ్డు గుంతలతో అధ్వాన్నంగా ఉందని, భరణిపాడు కాలువ మీద ఉన్న వంతెన శిథిలావస్థలో ఉందని, వీటికి అవసరమైన మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ ఆర్ అండ్ బీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం ఖానాపురం హవేలికి చెందిన ఎన్. నటరాజ్ తాను దివ్యాంగుడినని తనకు సొంత ఇల్లు లేనందున ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. నేలకొండపల్లి మండలం అప్పల నర్సింహపురం గ్రామస్తులు తమ గ్రామంలో సెల్ఫోన్ సిగ్నల్ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రామ ప్రజల ఇబ్బందుల దృష్ట్యా జియో టవర్ నిర్మించుటకు అనుమతించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ డి విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. వైరా మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన ఎస్సీ కాలనీ వాసులు నిరుపయోగంగా ఉన్న ఎన్.ఎస్.పి. కెనాల్ స్థలంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వైరా మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణిలో "విద్యార్థి టు విజ్ఞాన్", "రూట్స్ టు రోబోట్" ఘనంగా సైన్స్ ఎక్స్ పో





**ఖమ్మం ఎడ్యుకేషన్, కెరటం న్యూస్:** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని త్రివేణి పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్ సి ఎస్ సి కోఆర్డినేటర్ శ్రీ ఎనుముల వెంకటేశ్వర్లు గారు మరియూ ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు అనేక రకాలైన ప్రాజెక్టు నమూనాలను తయారుచేసి ప్రదర్శనకు ఉంచారు. సహజ నీటి శుద్ధి పద్ధతులు, కృత్రిమ అవయవాల నిర్మాణం, కృత్రిమ డ్రోన్ నిర్మాణం, త్రీడీ హోలో గ్రామ్స్, స్మార్ట్ వీల్ చైర్, వ్యవసాయ వ్యర్థాల నుంచి బయో ఇంధన తయారీ, రోబోటిక్ ఇంజనీరింగ్ టెక్నిక్స్, ఆమ్లక్షారాల గుర్తింపు, ఆహార పదార్థాల కల్తీ నివారణ , రక్త గ్రూపుల నిర్ధారణ, షుగర్ పరీక్ష విధానం,శరీర అవయవాల పనితీరును తెలిపే మోడల్స్, ఇంకా అనేక రకాలైన జీవనమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ సర్ సివి రామన్ భౌతిక శాస్త్రానికి చేసిన సేవకు గాను వారు పొందిన నోబెల్ బహుమతి ద్వారా ప్రపంచానికి భారతీయ శాస్త్రవేత్తల యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పారని ఇప్పుడున్న ఆధునిక వైద్య శాస్త్రానికి సర్ సివి రామన్ కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్ అనేటువంటిది ఎంతో ఉపయోగపడుతుందని రోగనిర్ధారణ పరీక్షలలో దీని పాత్ర గొప్పదని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం మానవుని యొక్క జీవనమని, మనిషి జీవితంలోని ప్రతి క్షణం ప్రతి విషయము, విజ్ఞాన శాస్త్రముతో ముడిపడి ఉన్నదని విద్యార్థులు ప్రతి విషయాన్ని ఎందుకు? ఏమిటి? ఎలా? అనే పరిశోధనాత్మక ధోరణిలో నేర్చుకోవాలని అన్నారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ ,పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలి



**వైరా టౌన్, కెరటం న్యూస్:** అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలని, ప్రపంచ కార్మికులకు దిక్సూచి "కమ్యూనిస్టు ప్రణాళిక" అని జిల్లా రాజకీయ విద్యా విభాగం సభ్యులు పారుపల్లి చంద్రశేఖర్ బాబు, మల్లెంపాటి వీరభద్రరావు అన్నారు. స్థానిక బోడేపూడీ భవనంలో "రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని పార్టీ వైరా డివిజన్ కార్యదర్శివర్గ సభ్యురాలు మచ్చా మణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పారుపల్లి చంద్రశేఖర్ బాబు, మల్లెంపాటి వీరభద్రరావు మాట్లాడుతూ కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక వెలువడిన 1948, ఫిబ్రవరి 21 రోజును "రెడ్ బుక్ డే"గా గుర్తు చేసుకుంటామని తెలిపారు. ఈ చిన్న గ్రంథం "ప్రపంచ కార్మికులారా ఏకంకండి, పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప" అంటూ శ్రామిక వర్గానికి ఇచ్చిన పిలుపు పెట్టుబడిదారీ వర్గాన్ని ఉలికిపాటుకు గురిచేసింది అన్నారు. పెట్టుబడిదారి దోపిడి కబంధ హస్తాలలో చిక్కుకున్న ప్రపంచ శ్రామికులకు కమ్యూనిస్టు ప్రణాళిక ఒక దిశ నిర్దేశం చెందిందని అన్నారు. అమెరికా పెట్టుబడిదారులకు, ప్రజా వ్యతిరేక శక్తులకు కొమ్ము కాస్తూ ప్రపంచ దేశాల మధ్య యుద్ధోన్మాదాన్ని రెచ్చగొడుతుందని విమర్శించారు. ప్రపంచ దేశాల మీద తన ఆధిపత్యం కోసం సుంకాలను విధిస్తుందని, తన బెదిరింపులకు లొంగని దేశాల మీద దాడులు చేసి వారిని బంధీలుగా తీసుకొని పోతుందని అన్నారు. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను, ఐక్యరాజ్య సమితిని లెక్క చేయకుండా తన సామ్రాజ్యవాద వైఖరిని అమెరికా ప్రదర్శిస్తున్నదని అన్నారు.

## బీజేపీ నాయకుల అక్రమ అరెస్టును ఖండించండి

### బిజెపి పాలేరు అసెంబ్లీ ఇంచార్జ్ నున్నా రవికుమార్




**పాలేరు, కెరటం న్యూస్ ప్రతినిధి:** కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పై కాంగ్రెస్ పార్టీ నాయకుల దాడిని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ రాష్ట్ర అధ్యక్షులు నారపు రాజు రామచంద్ర రావు,బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వ రెడ్డి ల అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఈ రోజు నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా నాయకులు నున్నా రవికుమార్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మంట కలిసిందని . కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ గుండాల దాడి చాలా దుర్మార్గం అని అదేవిధంగా బాన్సువాడలో జరిగినటువంటి సంఘటన ఈ రాష్ట్రంలో హిందువులకు భద్రత లేకుండా పోయిందని కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు వత్తాసు పలుకుతూ హిందువులపై దాడిని ప్రేరేపిస్తున్న విధంగా ఉందని, అదేవిధంగా ఆర్మూర్లో జరిగినటువంటి సంఘటన కూడా దీనికి నిదర్శనం అని కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లిం పార్టీ ముస్లింస్ అంటే కాంగ్రెస్ పార్టీ అని సాక్షాత్తు ముఖ్యమంత్రి చెప్పటం నా పేరు రేవంత్ ఉద్దీన్ అని చెప్పుకోవడం ఈ రాష్ట్రంలో ముస్లింలతోటి హిందువులపై దాడులు చేపించడానికి హిందువులను బలహీనపరచడానికి ప్రేరేపిస్తున్నారని, భారతీయ జనతా పార్టీ ఎదుగుదలను చూసి తట్టుకోలేక ఇటువంటి సంఘటనలకు ప్రేరేపిస్తున్నారని దీన్ని భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని కేంద్ర ప్రభుత్వం దీన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తుందని భారతీయ జనతా పార్టీ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి మరియు బండి సంజయ్ కుమార్ లు జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి తెలంగాణలో జరుగుతున్నటువంటి ఈ దుర్మార్గాలను కేంద్ర పార్టీ దృష్టికి తీసుకు వెళ్తున్నారని రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ నాయకులకు కార్యకర్తల పై ఎటువంటి దాడులు జరిగిన చూస్తూ ఊరుకోదని రాష్ట్రంలో రాబోయేది భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమేనని అని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోటి హనుమంతరావు మండల ప్రధాన కార్యదర్శి మల్ల బోయిన గోవిందరావు, కందరబోయిన గోపి, కొండా హర్ష వర్ధన్, జల్లా సురేష్, గురజాల వీరబాబు , రాపల్లి కొండల్, కాలింగ్ వెంకటేశ్వర్లు, స్వామి దాస్, హల్లు కృష్ణారావు మరికొంతమంది భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జీపీ వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని


### జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాడు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా పిలుపులో భాగంగా సోమవారం రోజు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నా ను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పెరుమాళ్ళ పల్లి మోహన్ రావు మాట్లాడుతూ పంచాయతీ వర్కర్స్ కు గత రెండు నెలలుగా జీతాలు పెండింగ్లో ఉన్నాయి వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్. మల్టీపర్పస్ వ్యవస్థ ను రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పంచాయతీ వర్కర్స్ డైరెక్టర్ గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని, భీమా సౌకర్యం పది లక్షలు ఇవ్వాలని చనిపోయిన వారి కార్మికుల కుటుంబాల నుంచి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ డిపిఒ రాంబాబు కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి రాంబాబు పుల్లయ్య రమేష్ నారాయణ జగ్గయ్య శ్రీవారి శ్రీనివాసరావు ధర్మేందర్ రాములు పాల్గొన్నారు.

## ప్రాణాలు పోతున్నా స్పందించని ప్రభుత్వం

### -పెన్షనర్ బకాయిలను తక్షణం చెల్లించాలి
### -ఎస్జిపిఏటి రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు
### -రిలే నిరాహార దీక్షలు ప్రారంభం







**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** పెన్షనర్ల బకాయిలు చెల్లించక పోవడం, ఆరోగ్యపరమైన సమస్యల పరిష్కారానికి హెల్త్ కార్డులను జారీ చేయకపోవడం తదితర కారణాలతో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ప్రాణాలు కోల్పోతున్నా ఈ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్సీపిఏటి) అధ్యక్షులు అర్విణి రాజేంద్రబాబు అన్నారు. పెన్షన్ బకాయిలు రాక ఒక ఖమ్మం జిల్లాలోనే ఏడుగురు ప్రాణాలు కోల్పోయారని అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. తొలి రోజు దీక్షల్లో 21 మంది పెన్షనర్లు దీక్షలో కూర్చోనగా పెద్ద సంఖ్యలో పెన్షనర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు హాజరై సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సభలో రాజేంద్రబాబు మాట్లాడుతూ 2024 మార్చి మాసం నుండి ఉద్యోగ విరమణ చేసిన వారికి బకాయిలు చెల్లించ లేదని ఇందులో కొందరికి పెన్షన్ సైతం రావడం లేదన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులతో పెన్షనర్లు మనో వేదనకు గురవుతున్నారని ఆయన తెలిపారు. పలుమార్లు వివిధ రూపాలలో రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ నెల 28న ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్లో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రూ.20వేల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

స్వాతంత్ర్యానికి ముందే పెన్షన్ విధానం ప్రారంభమైందని దేశ చరిత్రలో పెన్షన్ బకాయిలు చెల్లించకుండా ఇంత కాలం ఏ ప్రభుత్వం లేదని రాజేంద్రబాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన వ్యాలిడేషన్ చట్టం పెన్షనర్ల ఉనికిని ప్రమాదంలోకి నెడుతుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చిందని కానీ ఇంత వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదని దీనితో సరైన వైద్య సాయం పొందలేక పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. మెడికల్ అలవెన్స్ పెంపుదల చేయాలని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న పెన్షనర్ హక్కులను కాపాడేవిధంగా చట్టాలు రూపొందించాలని రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మార్చి 25న దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 398 ప్రత్యేక ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని,

వెల్నెస్ సెంటర్లలో వసతులు కల్పించాలని, బకాయిలను ఏక మొత్తంగా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఆందోళనలు వివిధ రూపాల్లో కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బి. నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గోపిచంద్,టిజివో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, తపస్ జిల్లా అధ్యక్షులు గంద్ర వెంకటరమణారెడ్డి, వివిధ సంఘాల నేతలు రామారావు, రామకోటేశ్వరరావు, మనోహర్రాజు సంఘీభావం తెలిపారు. 82 సంవత్సరాల విశ్రాంత మండల విద్యాదికారి దుగ్గినేని శ్రీనివాసరావు ఈ దీక్షలకు ప్రత్యేకంగా హాజరై సంఘీభావం తెలపటం అందరినీ ఆకర్షించింది.

నేడు మహిళా పెన్షనర్ల దీక్ష : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహిళా పెన్షనర్లు దీక్షల్లో పాల్గొననున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్ లు తెలిపారు. రెండవ రోజు దీక్షలను జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## దేశ భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**వికారాబాద్ బ్యూరో, కెరటం న్యూస్:** వికారాబాద్‌లో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని సామాజిక, ఆర్థిక రుగ్మతలకు పరిష్కారం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఉందని అన్నారు. రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రజల్లో నిరంతరం పనిచేస్తూ అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుల వివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం సాధనలో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక పాత్ర పోషించిందని పేర్కొన్న ఆయన, అంటరానితనం నిర్మూలన నుంచి భూ సంస్కరణలు, ఎస్సీ-ఎస్టీ హక్కుల పరిరక్షణ వరకు అనేక విప్లవాత్మక నిర్ణయాలు కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమయ్యాయని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడంతో పాటు సామాజిక న్యాయం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని విమర్శించిన ఆయన, రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ నాయకులు విశ్వనాథన్, వంశీ చందర్ రెడ్డి, సావంత్, సచిన్ రావుతో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.







## ప్రముఖులను కలిసిన డీసీసీ అధ్యక్షులు నూతి





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంఘటన్ శ్రీజన్ అభియాన్ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల మూడవ రోజు శిక్షణా తరగతుల సమావేశానికి విచ్చేసిన లిసెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ భూక్యా మంగ్యా నాయక్ ని, ప్రొఫెసర్ కంచె ఐలయ్యని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

## ఖమ్మం కొత్త బస్ స్థాండుకు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలి



**ఖమ్మం న్యూస్:** ఖమ్మం పట్టణంలోని నూతన బస్ స్థాండుకు భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని ఎస్సీ ఎస్టీ బీసీ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సేవా సంఘం ఘాటుగా డిమాండ్ చేసింది ఏప్రిల్ 14 జయంతి సందర్భంగా ప్రభుత్వం అధికార ప్రకటన చేసి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ బస్ స్థాండు గా నామకరణ చేయాలని విజ్ఞప్తి చేసింది ఫిర్యాదుల దినం సందర్భంగా జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేయగా ప్రభుత్వం తో చర్చించి డిమాండ్ నెరవేర్చే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కూడా పార్టీలకు అతీతంగా ముందుకు వచ్చి అంబేద్కర్ పేరు ప్రకటించాలని స్పష్టం చేశారు ప్రపంచ దేశాల్లో జై భీమ్ నినాదాలతో అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పిస్తుంటే ఖమ్మంలో మాత్రం నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు గుర్తు తెలియని వ్యక్తుల పేర్లతో విగ్రహాలు ఏర్పాటు చేస్తూ కాలయాపన చేయడం మానుకుని రాజ్యాంగ శిల్పికి తగిన గౌరవం ఇవ్వాలని హెచ్చరించారు జయంతి లోపే నామకరణపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ప్రజా ఉద్యమాలు తప్పవని ప్రకటించారు